క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన

కుంటాల: సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మహిళా కానిస్టేబుళ్లు అనుప్రియ, అశ్విని అన్నారు. బుధవారం కుంటాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పట్టుదలతో చదివి ఉన్నతస్థానాల్లో నిలవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీజే యజమానుల బైండోవర్

తానూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న డీజే యజమానులను బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మహేందర్‌నాథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. డీజే యజమానులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వాయి పాపన్నకు నివాళి



నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నేతలు

కుభీర్: మండలకేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో బుధవారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 375వ జయంతి నిర్వహించారు. నిజాం, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని పలువురు పేర్కొన్నారు. గౌడ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు కనకాగౌడ్, నాయకులు శంకర్, కృష్ణాగౌడ్, మహేశ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, సతీశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్, దేవేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాసరలో కొనసాగిన ఇండక్షన్

బాసర: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జీయూకేటీ)లో విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమం రెండో రోజు బుధవారం కొనసాగింది. వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, అభ్యాస పద్ధతులు, ప్రేరణ, విభాగాల పరిచయాలపై వివరించారు. డాక్టర్ శ్రవణ్, డాక్టర్ చంద్రశేఖర్, శేఖర్, డాక్టర్ వినయ్ కుమార్, అసోసియేట్ డీన్లు, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహగర్జన విజయవంతం చేయాలి

ఖానాపూర్: పెన్షన్‌దారులు, దివ్యాంగుల సమస్యలపై ఈనెల 22న పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్‌హాల్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సింహగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఇన్‌చార్జి రేనికుంట్ల సాగర్ కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం చేయూత పెన్షన్‌ను రూ.2వేల నుంచి 4వేలకు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4వేల నుంచి 6 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి విఫలమైందని పేర్కొన్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు రహీం, శనిగారపు రవి, నామత్‌కార్ లక్ష్మణ్, కత్తెరపాక శంకర్ తదితరులు ఉన్నారు.

మద్యం తాగి నడిపితే చర్యలు



తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై షేక్ జుబేర్

తానూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై షేక్ జుబేర్ వాహనదారులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని బోరిగాం గుట్ట సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ధ్రువపత్రాలు తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైద్యురాలి ప్రతిభ



రాశి

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ కాలనీకి చెందిన రేషన్ డీలర్ జల్ల గంగాధర్ కుమార్తె జె.రాశి నీట్ ప్రవేశపరీక్ష (పీజీ) ఫలితాల్లో ప్రతిభ కనబర్చింది. ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేసిన రాశి పీజీ వైద్య విద్య కోసం నిర్వహించిన పరీక్షలో జాతీయస్థాయిలో 606 మార్కులతో 2,398 ర్యాంకు సాధించింది. ఈమెను పద్మశాలి సంఘం సభ్యులు, పలువురు అభినందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కుంటాల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈవో ముత్యం పేర్కొన్నారు. బుధవారం కుంటాల బీసీ వసతిగృహంలో విద్యార్థులకు వడ్డించే భోజనం పరిశీలించారు. రోగాల బారిన పడకుండా పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఆయన వెంట హెచ్‌డబ్ల్యూఓ నగేశ్ తదితరులు ఉన్నారు.

వైద్యశాలకు వెళ్లేదెలా..?



కుంటాల: ఎడతెరిపి లేని వర్షాలతో కుంటాల పీహెచ్‌సీ ఆవరణ జలమయమైంది. వర్షపు నీటిలోనే బోరుబావి విద్యుత్ మోటారు, తీగలున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆసుపత్రికి వచ్చిపోయే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని.. వరద నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏడాదికే ‘శిథిలం’

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగుల కోసం ఏడాది కిందట రెండో అంతస్తు నిర్మించి పడకలు ఏర్పాటు చేశారు. కానీ రెండో అంతస్తుకు వెళ్లేందుకు మెట్లు ఎక్కే ప్రదేశంలో ఇటీవల పైకప్పు పెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో ప్రమాదం తప్పింది. నాసిరకం పనులతోనే పెచ్చులూడుతున్నాయని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



అటెన్షన్ ప్లీజ్.. గుంతతో ప్రమాదాలు



తానూరు: మండలంలోని బెల్‌తరోడా నుంచి తానూరు వెళ్లే మార్గంలో బాలాజీగుట్ట సమీపంలో డబుల్ రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. గుంతను తప్పించే క్రమంలో తరచూగా ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు. అధికారులు గుంత పూడ్చి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు

ప్రశ్నించాల్సిన అధికారి: సునీల్, ఆర్‌అండ్‌బీ డీఈ, **ఫోన్:** 84649 60600

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



భైంసాలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



కడెం : పూలమాల వేస్తున్న నాయకులు



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

భైంసాటౌన్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని.. ఆయన చూపిన బాటలో అందరం నడవాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ వివేకానంద, కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్ యాదవ్, నారాయణరెడ్డి, శంకర్ చంద్రే, ముత్యంరెడ్డి, షాహిద్, ఆత్మారావు తదితరులున్నారు.

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల మల్లేశ్‌యాదవ్, జిల్లా నాయకుడు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, నాయకులు శంకర్, మహమ్మద్ సలీం, అబ్దుల్ రహీమ్, బొడ్డు గంగన్న, రాజేశ్వర్, భూమేశ్ ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని మార్కెట్‌యార్డు చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ అబ్దుల్ మాజిద్ మాట్లాడారు. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, చిన్నం సత్యం, కావలి సంతోష్, అంకం రాజేందర్, షబ్బీర్ పాషా, యూసుఫ్ ఖాన్, గంగనర్సయ్య, సలీంఖాన్, షౌకత్ పాషా, అమానుల్లా ఖాన్, జహీర్ అహ్మద్, అయూబ్, జహీరొద్దీన్ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తన నివాసంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక రంగానికి పెద్దపీట వేయడంతోనే దేశం ముందుకెళ్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఫ్రోజ్‌ఖాన్, రాజన్న, ఫారుక్, పోతన్న తదితరులు ఉన్నారు.

ఆపదలో మనమే రక్షించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోన్: వరదలు, భూకంపాలు అగ్నిపర్వతాలు, భారీవర్షాలు, పిడుగులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మనల్ని మనమే రక్షించుకుంటూ ఇతరులను కాపాడాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని సోన్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి వినీత్ కుమార్ మాట్లాడారు. నీట మునిగిన వ్యక్తిని రక్షించే విధానం, రక్తం కారుతున్నప్పుడు, రోడ్డు ప్రమాదాల్లో ఎముకలు విరిగినప్పుడు అందించే ప్రథమ చికిత్స గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఏవో వినోద్‌కుమార్, ఏఈఓ ఉమామహేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లావాసులకు డాక్టరేట్



తానూరు : పట్టా అందుకుంటున్న మాధవ్‌రావ్



ఖానాపూర్: డాక్టరేట్ అందుకుంటున్న మహేందర్

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామానికి చెందిన జె.మాధవ్‌రావ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు పీహెచ్‌డీ పట్టా అందించారు. హిందీ విభాగాధిపతి ప్రొఫెసర్ సంగీత పర్యవేక్షణలో మాధవ్‌రావ్ ‘మంజుల్ భగత్‌కే ఉపన్యాసోమే’ అనే అంశంపై అధ్యయనం చేశాడు. మంగళవారం సంగీత చేతుల మీదుగా పట్టా అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయనను గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

ఖానాపూర్: పట్టణానికి చెందిన కీర్తి మహేందర్ మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో ‘పొలిటికల్ మొబిలైజేషన్ అండ్ లీడర్‌షిప్ ఆఫ్ ఓబీసీ ఇన్ తెలంగాణ’ అనే అంశంపై అధ్యయనం చేశాడు. ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 84వ స్నాతకోత్సవంలో ఐఎస్‌ఆర్‌వో చైర్మన్ నారాయణ, వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



ముధోల్ : మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్



భైంసారూరల్ : మాట్లాడుతున్న సీఐ నైలు



నిర్మల్‌రూరల్: మాట్లాడుతున్న సీఐ కృష్ణ

ముధోల్: ప్రశాంత వాతావరణంలో గణేశుడి నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. ముధోల్‌లోని జీఎం ఫంక్షన్‌హాల్‌లో మండపాల నిర్వాహకులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. మండపాల్లో గణేశుడి విగ్రహాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్, విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్రీలత, సీఐ మల్లేశ్, ఎస్సై బిట్ల పెర్సిస్ తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: రోడ్లపై, ప్రధాన కూడళ్ల వద్ద గణేశుడి మండపాలు ఏర్పాటు చేయవద్దని భైంసా రూరల్ సీఐ నైలు సూచించారు. బుధవారం మండలంలోని కామోల్ గ్రామంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేశుడి శోభాయాత్రలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో గ్రామస్తులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: గణేశుడి మండపాల్లో అధిక శబ్దం చేసే సౌండ్ సిస్టం వినియోగించొద్దని నిర్మల్‌రూరల్ సీఐ కృష్ణ సూచించారు. పట్టణంలోని మంజులాపూర్ గణేశుడి మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో రూరల్ ఎస్సై లింబాద్రి, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖానాపూర్: గణేశుడి మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. అనుమతి తీసుకొని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిమజ్జనం వరకు జాగ్రత్తలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

కుంటాల: వినాయక నవరాత్రి ఉత్సవాలకు డీజేల అనుమతి లేదని ఎస్సై అశోక్ పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో డీజేల నిర్వాహకులతో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు దేవన్న, జీవన్‌రావు, సిబ్బంది ఉన్నారు.

అడవి పందుల దాడిలో పంటలు ధ్వంసం



పసుపు పంట పరిశీలిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాం గ్రామంలో మొక్కజొన్న, పసుపు పంటలను అడవిపందులు ధ్వంసం చేశాయి. బుధవారం ఉద్యానవన అధికారి మౌనిక పంటలను పరిశీలించి బాధిత రైతుల వివరాలు నమోదు చేసుకున్నారు. దుబాక చిన్ననర్సయ్య అనే రైతు మొక్కజొన్న చేనులో 10 గుంటల మేర నష్టం జరిగినట్లు గుర్తించారు. ఇందులో ఏఈవో మౌనిక, ఉద్యాన అధికారులు దేవన్న తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్ తోటలు పరిశీలన

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామానికి చెందిన గొంగ రుక్మవ్వ, భీమన్న సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలను బుధవారం ఖానాపూర్ డివిజన్ ఉద్యాన అధికారి స్పందన పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వర్షాలు తగ్గిన తర్వాత తోటల్లో నిలిచిన నీటిని తొలగించాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



భైంసారూరల్: చెక్కులు అందిస్తున్న విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ బుధవారం పలువురు లబ్ధిదారులకు సీఎంరిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. భైంసా మండలంలోని ఖత్‌గాంకు చెందిన దెగ్లూర్ విఠల్‌కు రూ. 1.08 లక్షలు, బాసర మండలంలోని సావర్‌గావ్‌కు దిబ్బికర్ రాజుకు రూ.60 వేల విలువైన చెక్కులు మంజూరవగా వారికి అందించారు. బీజేపీ నాయకులు రమేశ్, మండల అధ్యక్షురాలు సుష్మరెడ్డి, శంకర్, మాజీ సర్పంచ్ రాము, తదితరులున్నారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఉన్న తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పలువురికి సీఎం సహాయనిధి చెక్కులు అందించారు. భైంసాకు చెందిన ఎండీ ఫైజాన్‌కు రూ.40వేలు, సమ్రీన్ బేగంకు రూ.12,500, సాబిర్‌కు రూ.9,500, మసూద్‌కు రూ.20వేలు, ఖాసీకి రూ. 60వేలు, పల్సి గజ్జారాంకు రూ.22వేల విలువైన చెక్కులు మంజూరవగా లబ్ధిదారులకు అందించారు.

నిధులు మంజూరు చేయాలి..

ముధోల్ మండలంలోని బోరిగాం గ్రామంలో యాదవ సంఘం భవనానికి నిధులు మంజూరు చేయించాలని ఆ సంఘం సభ్యులు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు ఫారుక్, కిష్టయ్య, రాజన్న, చొండి రాజేశ్వర్, వెంకటి, పిరాజీ, లక్ష్మణ్, దేవేందర్, తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలకేంద్రానికి చెందిన షేక్ అహ్మద్‌కు రూ.36,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. బుధవారం సదరు చెక్కును లబ్ధిదారుకు పలువురు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అఫ్రోజ్‌ఖాన్, యాజుద్దీన్, అభి హుస్సేన్, ఇమ్రాన్‌ఖాన్, ముజాహిద్ తదితరులు ఉన్నారు.

మహాధర్నా విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

భైంసాటౌన్: పెన్షన్ విద్రోహదినం సందర్భంగా సెప్టెంబర్ 1న చేపట్టే పీఆర్‌టీయూ మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సంఘ కార్యాలయంలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఎస్ రద్దు డిమాండ్‌తో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే ధర్నాకు జిల్లా నుంచి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సయ్యద్ అన్సర్, జై శివరాం నాయక్, నర్సింలు, గంగమోహన్, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు వందన, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్, సలీం హైమద్‌ఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, భైంసా డివిజన్‌లోని ఆయా మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సాఠేకు నివాళి

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో బుధవారం అన్నాభావు సాఠే జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సాఠే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన జి.కల్యాణ్‌ను మండలంలోని పార్డి(కె) గ్రామస్తులు బుధవారం శాలువా, పూలమాలలతో సన్మానించారు. మాజీ ఎంపీటీసీ శంకర్, చంద్రశేఖర్‌పటేల్, విజయ్, నాగలింగం, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన గుడిసెల పండరిగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం పండరిగౌడ్ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, భైంసా ఆత్మ చైర్మన్ వివేకానంద, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, మహమ్మద్ షఫీ, నారాయణ్‌రెడ్డి, చంద్రకాంత్, దేవిదాస్, శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి ఉన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర గ్రామాల్లో బుధవారం పీఎం ఆవాస్ యోజన సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సోలమాన్‌రాజ్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి అందులోంచి ఎల్‌వన్ జాబితాలో 209 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా మార్కౌట్ ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

నష్టపోయిన వారిని ఆదుకోవాలి

ఖానాపూర్: భారీ వర్షాలతో నష్టపోయిన వారికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని బహుజన కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి పసుపుల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల్లో పంటలు నష్టపోయిన రైతులతోపాటు ఇళ్లు కూలిపోయిన వారికి, ఇతర బాధితులకు పరిహారం ఇవ్వాలని కోరారు. అధికార యంత్రాంగం సర్వే చేసి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పొంచి ఉన్న ముప్పే

- తూము వద్ద ప్రమాదకరంగా ధర్మారం–సోన్ రోడ్డు



తూము వద్ద ప్రమాద స్థితి తెలిసేలా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన కర్రలు

లక్ష్మణచాంద: ఇటీవలి వర్షాలకు మండలంలోని ధర్మారం నుంచి సోన్ మండలకేంద్రానికి వెళ్లే రోడ్డు దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. గతంలో పీచర చెరువు నుంచి వచ్చే ఒర్రె అలుగుపై తూము వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో అధికారులు తూతూమంత్రంగా రోడ్డు తెగిన చోట రెండు పైపులు వేసి మట్టి పోయించారు. మళ్లీ ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు తూము పైపులపై పోసిన మట్టి కొటుకుపోతుంది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతుండటంతో రోడ్డుకు ఇరువైపులా కర్రలు ఏర్పాటు చేశారు.

లోలెవల్ వంతెన నిర్మించాలి

నిజామాబాద్ వెళ్లే మండల ప్రజలు తమ దూరభారం తగ్గించుకునేందుకు నిర్మల్ వెళ్లకుండా ఈ రోడ్డు మీదుగా సోన్ వెళ్లి.. అక్కడ నుంచి నిజామాబాద్ వెళ్తారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన రోడ్డు వద్ద లోలెవల్ వంతెన నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని మండలంలోని ప్రజలు వేడుకుంటున్నారు.

ముగిసిన సప్తాహం



కాగడ హారతిలో భక్తులు

తానూరు: మహారాష్ట్రలోని పండరిపురంగా భావించే తానూరులోని విఠలేశ్వరస్వామి ఆలయంలో వారం రోజులుగా కొనసాగిన తాళ సప్తాహం ముగిసింది. బుధవారం తెల్లవారుజామున నిర్వహించిన కాగడ హారతిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విఠల–రుక్మిణి దేవతామూర్తులకు పవిత్ర స్నపనం, అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు పింటు మహరాజ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.